క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.20 వేల విరాళం



వెల్దండ: మండలంలోని పోతేపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన బోయినిపల్లి లింగమయ్యగౌడ్ శుక్రవారం రూ.20వేల విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటమ్మ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

మసీదు నిర్మాణ పనుల పరిశీలన



పెద్దకొత్తపల్లి: మండలంలోని వెనచర్లలో మసీదు నిర్మాణం పనులను ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదు నిర్మాణం పనులు కాంట్రాక్టర్ నాణ్యతగా చేపట్టాలని సూచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అందరు సోదరభావంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ఖాజా, సలీం, కరీం, శంకర్, సత్యేశ్వరం పాల్గొన్నారు.

వడ్డెర సంఘం ఏర్పాటు



పెద్దకొత్తపల్లి: మర్రికల్, నక్కలపల్లి గ్రామాల్లో గ్రామాల వడ్డెర సంఘాలను ఏర్పాటు చేసినట్లు మండల వడ్డెర సంఘం అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి రాజులు తెలిపారు. మర్రికల్ గ్రామ వడ్డెర సంఘం అధ్యక్షుడిగా సత్యేశ్వరం, ఉపాధ్యక్షుడిగా మల్లేష్, రాములు, ప్రధాన కార్యదర్శిగా మల్లయ్య, కోశాధికారిగా బాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మల్లేష్, మద్దిలేటి, నర్సింహ పాల్గొన్నారు.

నేడు ముఖ్య నాయకుల సమావేశం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వైఆర్ఆర్ కాంప్లెక్స్‌లో శనివారం భారత రాష్ట్ర సమితి నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా నియోజకవర్గ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఈనెల 19 నుంచి బ్రహ్మోత్సవాలు



కొల్లాపూర్: పట్టణంలోని రామాలయంలో ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు రాఘవేంద్రాచార్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీరామ నవమి వేడుకల అనంతరం ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాల్లో భాగంగా 21 వతేదీన సాయంత్రం ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం, 23 వతేదీన దేవతామూర్తులను రథోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కమాన్ నిర్మాణ పనులను అడ్డుకుంటాం



కొల్లాపూర్: పట్టణంలోని గ్రంథాలయం పక్కన నూతనంగా నిర్మించనున్న కమాన్ నిర్మాణ పనులను నిలిపివేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు ఎల్లేని సుధాకర్‌రావు మున్సిపల్ అధికారులను కోరారు. శుక్రవారం ఆయన కమాన్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే విధంగా నిర్మాణాలు చేపట్టడం సరైంది కాదన్నారు. నిర్మాణ పనులను పూర్తిస్థాయిలో ఆపకుంటే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు శేఖర్‌గౌడ్, సంధు రమేష్, కట్టాల కృష్ణ, ధనుంజయ్‌గౌడ్, కురుమయ్య, శివకృష్ణయాదవ్, పరమేష్, మద్దిలేటి తదితరులున్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



ఓంనగర్ కాలనీ సంతోషిమాత ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఏకశిల గణపతి వద్ద ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి దంపతులు

బిజినేపల్లి: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిమ్మాజిపేట మండలంలోని ఆవంచ గ్రామ ఏకశిల గణపతికి ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా గ్రామంలో వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఉత్సవానికి హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలన్నారు. గ్రామ అభివృద్ధికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో తిమ్మాజిపేట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆయన అనుచరులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు

నాగర్ కర్నూల్: జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీ సంతోషిమాత దేవాలయంలో క్రోధి నామ సంవత్సర చైత్ర మాసం చవితి సందర్భంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ప్రకాష్ శర్మ తెలిపారు. ఉదయం ప్రత్యేక ద్రవ్యాలతో అభిషేకం, అలంకరణ, మహిళా భక్తులతో సామూహిక కుంకుమార్చన ఉద్యాపనం, కలశ పూజలు, వడి బియ్యం, డోలారోహణం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా నైవేద్యాలు నివేదన, మహా మంగళహారతి చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భాగమ్మ, అరుణ, రాజేశ్వరి, శ్రీదేవి, శివ కుమార్, మహిళలు పాల్గొన్నారు.

రామాలయం ముస్తాబు

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన కట్టడాలను వివిధ రకాల రంగులతో తీర్చిదిద్దుతున్నారు. గాలి గోపురంతో పాటు, ఆలయ శిఖరం, ఆలయం ప్రాంగణంలో ఉన్న రాతి స్తంభాలు, ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించే రథాలను రంగులు అద్దుతున్నారు. ప్రధాన మార్గంలో ఉన్న ముఖద్వారాన్ని శుభ్రం చేయించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలను కల్పిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు పూజారి భాస్కర్ తెలిపారు.



గాలి గోపురాన్ని ముస్తాబు చేస్తున్న కార్మికులు



ముఖద్వారం

బీజేపీతోనే దేశ రక్షణ



వట్టెంలో ర్యాలీలో పాల్గొన్న బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్

బిజినేపల్లి: బీజేపీతోనే దేశ రక్షణ సాధ్యమని నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని వట్టెంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు దిలీపాచారి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేదల సంక్షేమం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం కిసాన్‌సమ్మాన్ నిధి పథకాన్ని అమలు చేస్తుందన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. అంతకుముందు స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల నాయకులు భూషయ్య, నారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు ఎండకుండా చర్యలు



మొక్కలకు నీరు అందిస్తున్న కార్మికులు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో నాటిన హరితహారం మొక్కలు ఎండిపోకుండా రక్షించుకోవాలని ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం వాటరింగ్ డే సందర్భంగా ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్మికులతో ఆయా గ్రామాల్లో మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీరు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో మొక్కలను రక్షించుకోవడానికి ప్రత్యేక దృష్టి పెట్టామని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో కార్యదర్శులకు, ఫీల్డ్‌అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ముఖ్యంగా రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలు, పల్లె ప్రకృతిలో నాటిన మొక్కలను రక్షించుకోవాలన్నారు. అదేవిధంగా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎండ తీవ్రత నుంచి రక్షించుకోవాడానికి గ్రీన్‌టెంట్లు వేశామన్నారు. అనంతరం మొక్కలకు నీరు అందించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్‌అసిసెంట్లు, టీఏలు రాజ్‌కుమార్, సత్యనారాయణ, శివలీల తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వెల్దండ మండలం తిమ్మినోనిపల్లిలో ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు



కల్వకుర్తి మండలం జిల్లెలలో..

వెల్దండ: మండలంలోని తిమ్మినోనిపల్లి గ్రామానికి చెందిన ఎక్లాస్కాన్‌పేట శివ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శుక్రవారం బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకుడు గండికోట రాజు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని జిల్లెల గ్రామానికి చెందిన రాములు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి గ్రామ మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య, ముత్యాల రమేష్ ఆధ్వర్యంలో రూ.6 వేలు ఆర్థికసాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదేవిధంగా గ్రామానికి చెందిన మరో మాజీ సర్పంచ్ గుమ్మకొండ రాములు మృతుడి కుటుంబానికి రూ.4 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పాండుగౌడ్, పాండురంగారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, రవిగౌడ్, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణానికి ..

మండలంలోని పంజుగూల, మార్చాల గ్రామాలకు చెందిన నీలమ్మ, కృష్ణయ్య ఇళ్ల నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆర్థికసాయం అందించారు. నీలమ్మ ఇంటి నిర్మాణం కోసం రెండు ట్రాక్టర్ల ఇసుక కొనుగోలు చేసేందుకు, మార్చాల కృష్ణయ్య ఇంటి నిర్మాణం చేసుకునేందుకు మరో రెండు ట్రాక్టర్ల ఇసుక కొనుగోలు కోసం ఇద్దరికి ఆర్థికసాయం అందజేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని ఉప్పల వెంకటేష్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకుడు దారమోని గణేష్, మార్చాల ఎంపీటీసీ సంతోష్, మల్లేష్‌లు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ బాలయ్య, లింగం, గోపాల్, బాలయ్య, రాజు, కృష్ణ తదితరులు ఉన్నారు.

వేగంగా సాగుతున్న కాల్వ పనులు



పనులు చేస్తున్న కార్మికులు

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా అసంపూర్తిగా మిగిలిపోయిన పనుల నిర్మాణం కల్వకుర్తి మండలంలో వేగంగా సాగుతున్నాయి. కాల్వలలో నీరు లేకపోవడంతో నీటిపారుదల శాఖ అధికారులు పనుల నిర్మాణం చేపట్టారు. శుక్రవారం పనులను కేఎల్ఐ రైతు జేఏసీ అధ్యక్షుడు బండెల రామచంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 126వ కిలోమీటర్ల వద్ద యూటీ నిర్మాణం, 124వ కిలోమీటర్ల వద్ద ఎస్ఎల్ఆర్‌బీ, 125 కిలోమీటర్ల వద్ద మరో యూటీ నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని కోరారు. వెంకటాపూర్ తండా వద్ద సైడ్‌వాల్స్ నిర్మాణం చేపట్టాలని కోరారు.

చేతిపంపునకు మరమ్మతు



సాక్షి ఎఫెక్ట్..

తెలకపల్లి: మండలంలోని గౌరారం ఎస్సీకాలనీతోపాటు ఓవర్‌హెడ్ ట్యాంక్ వెనకాల ఉన్న మరో చేతిపంపులు చెడిపోయి వృథాగా పడి ఉన్నాయని ఈ నెల 10వ తేదీన చేతి పంపులకు మరమ్మతు చేయాలని శీర్షిక పేరుతో సాక్షిలో ప్రచురితమైంది. గ్రామ ప్రత్యేకాధికారి, గ్రామపంచాయతీ సెక్రెటరీలు స్పందించి శుక్రవారం చేతిపంపును పరిశీలించారు. అనంతరం సామాగ్రిని తీసుకొచ్చి చేతిపంపునకు మరమ్మతు చేపట్టారు. నీటిని సరఫరా అయ్యేవిధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు, కాలనీవాసులు సాక్షి పత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతలపల్లి, నార్లాపూర్, జవాయిపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో ఐకేపీ చెందిన గ్రామ సంఘాల సభ్యులు వరి కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఏ గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2203లు మద్దతుధర నిర్ణయించారు. కార్యక్రమంలో అధికారులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి



అచ్చంపేట రూరల్: ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు, ఎమ్మెల్యే వంశీకృష్ణ సతీమణి డాక్టర్ అనురాధ కోరారు. శుక్రవారం పట్టణంలోని రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కొన్నేళ్లుగా సొసైటీ ఆధ్వర్యంలో బాటసారుల దాహర్తిని తీర్చడం గొప్ప విషయమన్నారు. సొసైటీ అధ్యక్షురాలు జయమ్మ, మాధవి, లత, రాధిక, కళావతి, అంజలి, మంజుల, వనజ, నాగలక్ష్మి, గిరిజ, కౌన్సిలర్లు సునిత, గౌరీశంకర్ పాల్గొన్నారు.

నోటుకు ఓటును అమ్ముకోవద్దు

కల్వకుర్తి: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు విలువైందని, ఓటర్లు నోటుకు అమ్ముకోవద్దని జైభారత్ సంఘం జాతీయ కార్యదర్శి లోక్‌నాథ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఓటుపై ప్రభుత్వాలు, ప్రచార సాధనాలు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన ప్రజలు నాయకుల తాయిలాలకు లొంగడం సరికాదన్నారు. ఓటును సక్రమంగా వినియోగించుకుంటే ప్రజాప్రతినిధిని సమస్యలపై గట్టిగా ప్రశ్నించవచ్చన్నారు. కార్యక్రమంలో జై భారత్ సంఘం ప్రతినిధులు, పట్టణంలోని పలువురు నాయకులు, యువకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



మాట్లాడుతున్న డాక్టర్ మల్లు రవి

ఉప్పునుంతల: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ చతికిలపడిపోయుందని, ఇక బీజేపీ పార్టీ మత రాజకీయాలకు రెచ్చగొడుతూ రాజ్యాంగానే మార్చే యోచనలో ఉందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే భారీ మెజారిటీతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, నాయకులు అనంతరెడ్డి, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలింపు: కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని తాడూరుకు చెందిన గోస్క నరేందర్ శుక్రవారం అక్రమంగా మద్యం తరలిస్తూ గ్రామంలోనే పట్టుబడినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు. అతని వద్ద నుంచి 13 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడిపై అన్న దాడి ఘటనలో..

మండలంలోని తాడూరు గ్రామానికి చెందిన గుండెమోని కాశీంపై గురువారం అతడి అన్న గుండెమోని రాములు దాడి చేసి ఘటనపై కేసు నమోదైంది. ఎస్ఐ లెనిన్ వివరాల ప్రకారం అన్నదమ్ముళ్ల వ్యవసాయ పొలంలో పొత్తులో వేసుకున్న బోరు విషయంలో గొడవపడ్డారు. ఇద్దరి మధ్య మాటమాట పెరిగింది. దీంతో తమ్ముడిపై అన్న దాడి చేశారు. ఈ ఘటనలో తమ్ముడికి గాయాలయ్యాయి. శుక్రవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

సారా స్వాధీనం..

లింగాల: మండలంలోని అవుసోలికుంటలో శుక్రవారం సారా తయారీ కేంద్రాలు, విక్రయాలపై సోదాలు నిర్వహించినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటమ్మ నుంచి 6 లీటర్ల సారాను స్వాధీన చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



తాడూరు: మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుకు అనుసరించుకొని ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రం నుంచి కల్వకుర్తికి వెళ్లే ప్రధాన డబల్‌రోడ్డును అనుసరించుకొని దాదాపు నాలుగేళ్ల కిందట ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు పరిశీలించి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

కరపత్రాల ఆవిష్కరణ



అమ్రాబాద్: మాల ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 14న అచ్చంపేట లో నిర్వహించే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సభకు సంబంధించిన కరపత్రాలను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. శుక్రవారం పదరలో అంబేద్కర్ రథయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమక్షంలో కరపత్రాలను విడుదల చేశారు. సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు శ్రీనివాసులు, జనార్దన్ తదితరులు ఉన్నారు.

టీషర్టులు, జెండాలు వితరణ

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారం గ్రామ నివాసి, అనూష ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, పారిశ్రామికవేత్త జలంధర్‌రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు రూ: 50 వేల విలువ చేసే టీషర్టులు, జెండాలు వితరణ చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు దూమర్ల ఎల్లస్వామి, మాచారం గ్రామస్తులు రేణయ్య, రాంచంద్రయ్య, రవి తదితరులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

పాతబావిని పూడ్చండి



వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో రైతువేదిక వద్ద ప్రమాదభరితంగా ఉన్న పాతబావిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు. రైతులు ధాన్యం తీసుకురావడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వేదికకు అడ్డంగా పాత బావి ఉందని, దానిని పూడ్చాలని అనేక సార్లు రైతులు అధికారులకు వివరించారు. రూ. లక్షలు వెచ్చించి రైతు వేదికను నిర్మించిన అక్కడ నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని సమస్యను తీర్చాలని రైతులు కోరుతున్నారు.

మొక్కల రక్షణకు నెట్ ఏర్పాటు



పాన్‌గల్: హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం కోసం ఊరూరా నర్సరీలు పెంచుతన్నారు. వేసవిలో ఎండలు పెరగడంతో మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కల రక్షణకు నర్సరీల్లో పచ్చని పందిళ్ల (షెడ్ నెట్) ఏర్పాటు చేశారు. ఎండలకు మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ నీడ ఏర్పాటుతో పాటు రోజు వాటరింగ్ చేస్తున్నట్లు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు పేర్కొంటున్నారు.

పంటలు కాపాడుకునేందుకు రైతుల పాట్లు



పంట చుట్టూ చీరలను ఏర్పాట్లు చేసిన రైతులు

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నె రిజర్వాయర్ వద్ద బోరుబావుల కింద వరి పంటను సాగు చేసుకున్న రైతులు పంటలు చేతికి వచ్చే దశలో పలు రకాలు పక్షుల వల్ల వాటిల్లుతున్న నష్టంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పొట్ట దశలో ఉన్న వరి పంటలపై పక్షులు వాలి గింజలను తినివేస్తుండడంతో వాటి నుంచి రక్షణ కోసం చీరలను రక్షణగా చుట్టుకోవడం, రాత్రివేళలో పెద్దపెద్ద బ్యాటరీ లైట్లను ఉపయోగించి పంట పొలం వద్దనే కావలి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు



శిథిలావస్థలో మహిళా సమాఖ్య భవనం



డ్వాక్రాభవనం

తాడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ఆవరణలో దశాబ్ద కాలం కిందట రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఐకేపీ కార్యాలయ నిర్వహణ కోసం అప్పట్లో రూ.6 లక్షలతో నిర్మించారు. అదేవిధంగా డ్వాక్రా మహిళా సంఘాల నిర్వహణ కోసం రూ.3 లక్షలు, హౌసింగ్ కార్యాలయాన్ని రూ.3 లక్షలు వెచ్చించి నిర్మించారు. ప్రస్తుతం ఈ భవనాలు నిర్వహణ లేకపోవడం వల్ల భవనాలు దెబ్బతిన్నాయి. మండల కార్యాలయాల ఆవరణలోనే ఉన్న భవనాల నిర్వహణ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్తచెదారంతో కార్యాలయాల ఆవరణాలు నిండిందని వాపోయారు. అధికారులు స్పందించి కార్యాలయాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.